క్లుప్తంగా

నేడు సమీక్ష సమావేశం

గండేడ్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం గండేడ్ మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి తెలిపారు. ఉత్సవాలపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

తైక్వాండోతో ఆరోగ్యం

మహబూబ్‌నగర్ క్రీడలు: తైక్వాండో నేర్చుకోవడం వల్ల శారీరక మానసిక ఆరోగ్యం పొందవచ్చని మున్సిపల్ వైస్ చైర్మన్ తాటి గణేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీపీహెచ్‌ఎస్‌లో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి.సాయిలు ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. విద్యార్థులు తైక్వాండో పోటీల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల నిరసన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్‌పై వనపర్తి డీసీహెచ్‌ఎస్ డా.రాజ్‌కుమార్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ నాయకులు జె.నర్సింహ, రంగయ్య, పద్మ కోరారు. ప్రభుత్వ ఆస్పత్రి కార్మికుల వేతనాల్లో కోతలు పెడుతున్న కాంట్రాక్టర్లపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో ఆదివారం భోజన విరామ సమయంలో కార్మికులు నిరసన తెలిపారు. కార్మికులకు సంబంధించిన పీఎఫ్, ఈఎస్‌ఐలో కాంట్రాక్టర్లు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అవినీతి, ఆగడాలను అరికట్టి ప్రభుత్వ ధనాన్ని కాపాడాల్సిన వనపర్తి డీసీహెచ్‌ఓ కాంట్రాక్టర్లకే వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. కార్మికులు దేవి, అలివేల, సునీత, నాగలక్ష్మి, కవిత, సంధ్య, భీమయ్య, యాదయ్య, లోకేష్ పాల్గొన్నారు.

కిక్‌బాక్సింగ్‌లో సత్తాచాటాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా విద్యార్థులు కిక్‌బాక్సింగ్‌లో సత్తాచాటి పతకాలు సాధించాలని మున్సిపల్ కౌన్సిలర్ రష్మితా అన్నారు. జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ ఆవరణలో ఆదివారం స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఒక్క రోజు ఉచిత శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రష్మితా తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ సలహాదారులు ఎంఎస్.విజయ్‌కుమార్, రిటైర్డ్ హెచ్‌ఎం వెంకట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

జడ్చర్ల టౌన్: గ్రామాల్లోకి వెళ్లి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషిచేయాలని బీజేపీ నాయకుడు డా.మధుసూదన్ యాదవ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మండల బీసీ ముఖ్యుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలు ఏ సమయంలోనైనా రావచ్చని, నాయకులు ఎవరని చూడకుండా పార్టీ బలోపేతం పైనే దృష్టి పెట్టాలన్నారు. మండల అధ్యక్షుడు రమేష్‌జీ, ఓబీసీ మండల అధ్యక్షుడు రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, గౌరీ పాల్గొన్నారు.

అవినీతి ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలి

పాలమూరు: రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వాన్ని ఇంటికి పంపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం పట్టణ కమిటీ కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో 9ఏళ్లుగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని తెలంగాణ సమాజం ఎదురుచూస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మాచారి, బీజేపీ నేత ఎన్.పీ వెంకటేష్, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిపాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులుగా శేఖర్‌గౌడ్, రాణి, పట్టణ ప్రధాన కార్యదర్శిగా దోమ లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులుగా శ్రీశైలం, అరవింద్, వెంకటేష్, సతీష్, రవికుమార్‌లు నియమితులయ్యారు.

నేడు మార్కెట్ లావాదేవీలు

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం లావాదేవీలు ప్రారంభం కానున్నాయి. ఆదివారం సెలవు కారణంగా మార్కెట్‌కు సెలవు ఇచ్చారు. తిరిగి సోమవారం ఈనామ్ టెండర్ల ద్వారా ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు ధాన్యం మార్కెట్‌కు తెస్తే టెండర్ల ద్వారా కొనుగోళ్లు జరుగుతాయని అధికారులు వివరించారు.

బీజేవైఎం అధ్యక్షుడిగా కుమార్ నాయక్

బాలానగర్ : బీజేవైఎం మండల అధ్యక్షుడిగా కుమార్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు పానుగంటి శ్రీశైలం చేతుల మీదుగా ఆదివారం నియామక పత్రం అందుకున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

సర్వ హంగులతో కస్తూర్బా



కోడూర్ శివారులో నూతనంగా నిర్మించిన కేజీబీవీ భవనం

- ప్రారంభానికి సిద్ధంగా కోడూర్ సమీపంలో నూతన భవనం
- రూ. 3.35 కోట్లతో నిర్మాణం
- కార్పొరేట్ స్థాయిలో వసతులు

మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని కోడూర్ సమీపంలో రూ. 3.35 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం నూతన భవనం నిర్మించింది. అన్ని సౌకర్యాలతో భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ప్రస్తుతం నిర్మించిన భవనంతో తరగతుల కొరత తీరనుంది. విద్యార్థినులకు సంఖ్యకు అనుగుణంగా నూతన భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. త్వరలోనే రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించనున్నారు. కాగా 2017 సంవత్సరంలో ఈ ప్రాంతంలో కేజీబీవీని 6 తరగతి నుంచి 7వ తరగతి వరకు తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 2019లో 8వ తరగతి, 2020లో 9వ తరగతి, 2021 సంవత్సరంలో 10వ తరగతి వరకు విద్యాబోధన నిర్వహిస్తున్నారు. కాగా ఏటా పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. అయితే కేజీబీవీలో బాలికలకు ఇంటర్ విద్య అందుబాటులో లేకపోవడం, గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లేందుకు సమయానుకూలంగా రవాణా సౌకర్యం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేసి తరగతులను ప్రారంభించాలని కోరుతున్నారు. కాగా ప్రస్తుతం 230 మంది ఇక్కడ విద్యను అభ్యసించనున్నారు.

పేద విద్యార్థినులకు వరం



కేజీబీవీలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్య అందుబాటులో ఉంది. ఇది పేద విద్యార్థినులకు వరంగా మారనుంది. నూతన భవన నిర్మాణం గురించి అడగగానే మంజూరుకు కృషి చేసిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు రుణపడి ఉంటాం.

–బి.శ్రీకాంత్‌గౌడ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు

వచ్చే విద్యా సంవత్సరంలో అందుబాటులోకి



ప్రభుత్వ సహకారంతో కస్తూర్బాలో విద్యార్థినులకు ఇప్పటికే నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. పాఠశాలకు మంచి స్పందన వస్తోంది. ప్రస్తుతం తాత్కాలికంగా బండమీదిపల్లి సమీపంలో నడుపుతున్న పాఠశాల వచ్చే విద్యా సంవత్సరంలో నూతన భవనంలోకి మారనుంది. తల్లిదండ్రులు దీన్ని గమనించి పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలి.

– సువర్ణ, ప్రత్యేక అధికారి, కేజీబీవీ

కాల్వ నిర్మాణ పనులు ప్రారంభం



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు బంగారుమైసమ్మ ఆలయం వద్ద రూ.6లక్షలతో నిర్మిస్తున్న మురుగు కాల్వ పనులను చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి ప్రారంభించారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కొబ్బరికాయ కొట్టి కార్యక్రమం చేపట్టారు. పనులు త్వరితగతిన, నాణ్యతతో పూర్తిచేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రఘురాంగౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, నాయకులు రామ్మోహన్, ఇమ్మడి యాదయ్య, రమణయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ



దేవరకద్ర రూరల్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆలోచనా విధానం నేటి తరానికి ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. పెద్దరాజమూర్‌లో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పుష్పమ్మ, ఎంపీపీ రమాదేవి, మండల అధ్యక్షుడు జెట్టి నర్సింహారెడ్డి, శ్రీకాంత్ యాదవ్, దొబ్బలి ఆంజనేయులు, గ్రామ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రికెట్ పోటీలు

గండేడ్: మండల పరిధిలోని పెద్దవార్వాల్‌లో వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రీమియర్‌లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌టీపీ పరిగి ఇన్‌చార్జ్ గౌస్ పాష రూ.50వేలు విరాళం అందించారు. గ్రామాల నుంచి క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పీపీఎల్ అధ్యక్షుడు ప్రశాంత్, ఉపాధ్యక్షుడు వెంకటేష్, వైఎస్సార్‌టీపీ అధ్యక్షుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

మైసమ్మకు ప్రత్యేక పూజలు

నవాబుపేట: మండల పరిధిలోని మైసమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారి చెంత భక్తజనం సేదతీరి ప్రశాంత వాతావరణంలో గడిపారు. దీంతో దేవాలయ ఆవరణ, అడవి భక్తులతో కోలాహలంగా మారాయి.

పిల్లల విజయాల్లో తల్లిదండ్రులే ప్రధానం



విద్యార్థులతో మున్సిపల్ వైస్ చైర్మన్

మహబూబ్‌నగర్ క్రీడలు: పిల్లలు సాధించే విజయాల్లో తల్లిదండ్రుల పాత్ర కీలకమని, ఉన్నత స్థానాల్లో ఉండాలని ఎంతో కష్టపడతారని మున్సిపల్ వైస్ చైర్మన్ తాటి గణేష్, వక్ఫ్ కాంప్లెక్స్ కమిటీ కార్యదర్శి జాకీర్ అన్నారు. కింగ్ షోటోకాన్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్న 25వ వేసవి ఉచిత కరాటే శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు కోసం తమ జీవితాలను త్యాగం చేస్తారని అన్నారు. అలాంటి వారి ఎంతో బాధ్యతగా, గౌరవభావంగా చూడాలని కోరారు. ఉచిత కరాటే శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్న మాస్టర్ జహంగీర్‌పాష ఖాద్రీని అభినందించారు. జహంగీర్‌పాష ఖాద్రీ మాట్లాడుతూ వచ్చేనెల 4న జిల్లా కేంద్రంలోని హెచ్‌బీ ఫంక్షన్‌హాల్‌లో వేసవి ఉచిత కరాటే శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, ముఖ్య అతిథిగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కింగ్‌షోటోకాన్ క్లబ్ ప్రతినిధులు రఫీక్ పటేల్, లక్ష్మణ్, హమీద్‌అలీ, తిరుపతయ్య, నూర్‌ఖాన్, ఎక్బాల్, మజీద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా బెల్టు గ్రేడింగ్ పరీక్షలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం జిల్లా తైక్వాండో సంఘం ప్రధాన కార్యదర్శి సురేందర్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్‌బాబు మాట్లాడుతూ పరీక్షల్లో 30 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. వీరిలో 15 మంది ఎల్లో బెల్టు, ముగ్గురు ఎల్లోబెల్టు-1, ఇద్దరు గ్రీన్ బెల్టు, ముగ్గురు బ్లూబెల్టు, ఏడుగురు రెడ్‌బెల్టు పొందినట్లు తెలిపారు. జిల్లా క్రీడాకారులు తైక్వాండోలో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభచాటి పతకాలు సాధించాలని కోరారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సాయిలు, కోశాధికారి ప్రవీణ్ కుమార్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా చెట్ల నరికివేత



ధర్మాపూర్ శివారులో నరికి వేసిన చెట్లు

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలో అక్రమ కలప రవాణ యథేచ్ఛగా సాగుతోంది. ముఖ్యంగా జమిస్తాపూర్, తెలుగుగూడెం గ్రామాలకు చెందిన చెట్ల నరికివేత ముఠా కొంతకాలంగా కార్యకలాపాలను జోరుగా సాగిస్తోందని పలువురు అంటున్నారు. ఈ మేరకు అటవీ శాఖలో పని చేస్తున్న ఓ ఉద్యోగి పాత్రపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సదరు ఉద్యోగి ప్రోత్సాహం తోనే అక్రమార్కులు బరి తెగిస్తున్నారనే అంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం ధర్మాపూర్ శివారులో నరికి వేసిన చెట్లను కొందరు లారీలో ఎక్కించి తరలిస్తున్న సమయంలో అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. అక్రమ కలప నిల్వ చేసి గుట్టుగా తరలిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న బీట్ ఆఫీసర్ రవితేజ ఘటనా స్థలానికి వెళ్లారు. ఎలాంటి అనుమతి లేకుండా చెట్లను లోడ్ చేసిన టీఎస్38టీ.1997 అనే నంబర్ ఉన్న లారీని పట్టుకున్నారు. ఫారెస్టు కార్యాలయానికి తరలించారు. ఇదిలా ఉండగా మహబూబ్‌నగర్ రూరల్ మండలంలో ఉన్న గ్రామాల్లో అనుమతి లేకుండా చెట్లు నరికివేస్తున్నా కొందరు అధికారులు చర్యలు తీసుకోకుండా జరిమానాలు విధించి లారీలను విడిచిపెడుతున్నారని ప్రజలు అంటున్నారు. జమిస్తాపూర్, తెలుగుగూడెం గ్రామాలకు ముఠా ఇది షరా మామూలే అని భావించి తమ పనులు కానిచ్చేస్తున్నారని చెబుతున్నారు. కాగా పట్టుబడ్డ లారీ వివరాలు తెలుసుకునేందుకు బీట్ ఆఫీసర్ రవితేజను వివరణ కోరగా.. ఎలాంటి అనుమతి లేనందున నరికిన చెట్ల లోడ్‌తో ఉన్న లారీని పట్టుకున్నామని వివరించారు. కానీ లారీ యజమాని ఎవరు, చెట్లు ఏ పరిధిలో ఉన్నాయి, తదితర విషయాలపై అడగగా.. పూర్తి స్థాయి సమాచారం లేదని దాటవేశారు.

ఒరిగిన లారీ : త్రుటిలో తప్పిన ప్రమాదం

గండేడ్: బండలలోడుతో వెళ్తున్న ఓ లారీ ప్రమాదవశాత్తు రోడ్డు కిందకు ఒరగడంతో అక్కడే ఆగిపోయి ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే తమిళనాడు నుంచి బండల లోడుతో ఓ లారీ తాండూరు వైపు వెళ్తోంది. ఈ క్రమంలో అంచన్‌పల్లి దాటి గండేడ్ సమీపంలో హైవేరోడ్డు నిర్మాణ దశలో ఉన్న ప్రాంతంలో ఒక్కసారిగా ఒరిగిపోయి అక్కడే ఆగిపోయింది. కాగా డ్రైవర్, క్లీనర్‌కు తృటిలో ప్రాణాపాయం తప్పింది. అక్కడే పనిచేస్తున్న వారు ఇటాచీ సహాయంలో లారీని రోడ్డుపైకి లాగి పంపించారు. కాగా రోడ్డు నిర్మాణం సాగుతున్నందున ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు.

వీరప్పయ్య కాంప్లెక్స్ బాధితుల ధర్నా

దేవరకద్ర: దేవుడా నీవే మాకు దిక్కు అంటూ ఆదివారం వీరప్పయ్య కాంప్లెక్స్ బాధితులు ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలోని రాయిచూర్ రోడ్‌లో అసంపూర్తి నిర్మాణంలో ఉన్నా కాంప్లెక్స్ వద్ద కార్యక్రమం చేపట్టారు. నాలుగేళ్ల క్రితం రోడ్డు పక్కన ఉన్న వీరప్పయ్యస్వామి దేవస్థానం స్థలంలో 54 షాపులను నిర్మించడానికి టెండర్లు వేశారు. దీంతో పలువురు చిరు వ్యాపారులు ఒక్కో షాపుకు దేవస్థానం వారు నిర్ణయించిన ప్రకారం రూ. 4 లక్షలు డీడీలు చెల్లించారు. కాగా ఇప్పటికీ షాపుల నిర్మాణం పూర్తికాలేదు. విషయంపై పలుమార్లు దేవస్థానం వారికి, ఎమ్మెల్యేకు తెలిపిన ఫలితం లేకపోవడంతో ఆందోళన చేపట్టినట్లు వారు తెలిపారు. బాధితులు నాగిరెడ్డి, రాము, రాజు, నరేష్, కృష్ణాజీ, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి పెద్దపీట



చంద్రాస్‌పల్లిలో బీటీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కోయిల్‌కొండ: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల సమగ్రాభివృద్ధికి పెద్ద పీట వేస్తోందని నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా మల్కాపూర్‌లో రూ.10లక్షలతో ఎస్సీ, బీసీ కమ్యూనిటీహాల్, కనాయపల్లిలో రూ.20లక్షలతో గ్రామపంచాయతీ భవనం, కనాయపల్లి నుంచి పారుపల్లి వరకు రూ.20లక్షలతో రోడ్డు నిర్మాణం, చంద్రాస్‌పల్లిలో 17లక్షలతో సీసీరోడ్డు, డ్రెయినేజీ నిర్మాణాలు, ఖాజీపూర్‌లో తిమ్మయ్య చెరువు వరకు రూ.16లక్షలతో రోడ్డు నిర్మాణం, కోయిల్‌కొండ నుంచి చంద్రాస్‌పల్లి వరకు బీటీరోడ్డు రెన్యువల్, అంకిళ్ల గేటు నుంచి చందాపూర్ వరకు బీటీరోడ్డు రెన్యువల్, అంకిళ్లలో నాబార్డ్ నిధులు రూ.76లక్షలతో గోదాం నిర్మాణాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్ రెడ్డి, సర్పంచ్‌లు కల్పన, కరుణాకర్‌రెడ్డి, నాగయ్య, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు భీంరెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, మోదీపూర్‌రవి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను అడ్డుకున్న తండా వాసులు

మండలంలోని వర్దన్నపల్లితండాకు రోడ్డును వేయించాలని గిరిజనులు మల్కాపూర్ నుంచి కనాయపల్లికి వెళ్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అడ్డుకున్నారు. ప్రస్తుత రోడ్డు ఇబ్బందికరంగా ఉండడంతో చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని, కొంత మంది రైతులు తమ పొలాల్లో రోడ్డు స్థలాన్ని కేటాయిస్తే సమస్య తీరుతుందని ఆయనకు తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి వెంటనే రోడ్డు వేయించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

డీడీ పత్రాల అందజేత

దేవరకద్ర: బస్వాపూర్‌లో గొర్రెల పంపిణీకి ఎంపికైన లబ్ధిదారులకు ఆదివారం డీడీ పత్రాలను అందజేశారు. గొర్రెల యూనిట్ల కోసం లబ్ధిదారుల వాటా కింద చెల్లించాల్సిన డబ్బులకు సంబంధించి డీడీలు తీయడానికి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, సర్పంచ్ హన్మంతు, గ్రామ సంఘం అధ్యక్షుడు నారాయణచారి, గొర్రెల కాపరుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిబిరం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: కలాం డ్రీం ఫోర్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈమేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ ముఖ్య అతిథి హాజరై మాట్లాడారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఏఎంఓ శ్రీనివాస్, ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీధర్, రామన్‌గౌడ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న నాటి ఉపాధ్యాయులు, విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని బాలాజీ హైస్కూల్ 1995–96 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం మయూరీ గార్డెన్స్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు నాటి ఉపాధ్యాయులను కార్యక్రమానికి ఆహ్వానించి సన్మానించారు. పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ దాదాపు 30 సంవత్సరాల తర్వాత అందరూ కలుసుకోవడం గొప్ప అనుభూతిని కలిగించిందని పేర్కొన్నారు.అందరూ జీవితాల్లో స్థిరపడి ఏదో ఒక వృత్తిలో స్థిరపడడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాండురంగారావు, రాజారావు, శివ, నవీన్, చంద్రశేఖర్, పద్మ, సృజన, అమరావతి పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992– 93 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేణుగోపాల చారి, అబ్దుల్ రహీం, అడ్డు, అన్సర్, సుధాకర్‌యాదవ్, లక్ష్మీకాంత్, రాజులతోపాటు పలువురు పాల్గొన్నారు.

పీయూకు సురవరం పేరు పెట్టేలా కృషి



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి పేరు పీయూకు పెట్టాలని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళుతామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పాలమూరు రెడ్డిసేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక బండమీదిపల్లిలో ఉన్న రెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో ప్రతిష్ఠించిన సురవరం ప్రతాపరెడ్డి, యోగివేమన, రాజ బహదూర్ వెంకట్రాంరెడ్డి విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మట్లాడారు. మహబూబ్‌నగర్ రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో పలు అభివృద్ధి పనుల కోసం రూ.30లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, సురవరం కుమారుడు డాక్టర్ కృష్ణవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కేసీ.నర్సిములు, వైస్ చైర్మన్ గణేష్, మార్కెట్ చైర్మన్ అబ్దుల్ రహెమాన్, వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది మనోహర్‌రెడ్డి, మాజీ శాట్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, రెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి పోతుల రాఘవారెడ్డి, కోశాధికారి వేపూర్ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ఫిరంగిదళం’ పుస్తక ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకు చెందిన ప్రముఖ కవి డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ రచించిన ‘ఫిరంగిదళం’ మొగ్గలు కవితా సంపుటాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ కేసీ.నర్సిములు, ప్రముఖ కవి కె.లక్ష్మణ్‌గౌడ్, టీఎస్‌జీవో జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రనాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్వర్, గిరిధర్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మండలంలోని కందూర్‌కి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. నాయకుడు కారెడ్డి దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వారిని మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్‌లు బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండలంలోని కందూర్ శివారులో స్వయంభుగా వెలిసిన రామలింగేశ్వర స్వామిని ఆదివారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్, గాయకుడు సాయిచంద్ దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్ ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో అకౌంటెంట్ అనంతసేన్‌రావు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రాంగణంలో చంద్రముఖి కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, విద్యార్థుల సాంస్కృతిక, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో స్వరలహరి కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు నాయిని భాగన్నగౌడ్, మేకల శ్రీనివాస్, డీకే.ఆంజనేయులు, శ్రీమిత్రకళా మండలి కార్యదర్శి వి.నారాయణ, బాలకృష్ణయ్య, వైదేహి తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఎన్టీఆర్ జయంతి



దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు శతజయంతిని వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు హన్మంతరెడ్డి, నాగరాజు, రాములు, ఆది హన్మంతరెడ్డి, బసవరాజు, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నవాబుపేట: మండలంలో ఎన్టీఆర్ జయంతి ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సత్యనారాయణ గౌడ్, స్వామి, శ్రీను, నర్సింహులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

మహబూబ్‌నగర్ క్రైం: తాళం వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీ చేశారు. టూటౌన్ ఎస్ఐ రవిప్రకాష్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని న్యూగంజ్‌కు చెందిన బాల్‌రాం ఈ నెల 27న కుటుంబ సభ్యులతో కలిసి ఫంక్షన్ కోసం వికారాబాద్ వెళ్లి ఆదివారం ఉదయం తిరిగి వచ్చారు. అయితే ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 8 తులాల బంగారం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ విషయమై బాధితుడు బాల్‌రాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సీడ్స్ ఫెస్టిసైడ్స్ కార్యవర్గం ఎన్నిక

జడ్చర్ల టౌన్: మండల సీడ్స్ ఫెస్టిసైడ్స్ అధ్యక్షుడుగా యం. యాదీశ్వర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం జరిగిన కార్యవర్గ ఎన్నికలో ఉపాధ్యక్షుడుగా ఆంజనేయులు గౌడ్, కొండలు, కార్యదర్శిగా సీపీ వెంకటయ్య, కోశాధికారిగా బి.శ్రీరామ్‌గౌడ్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం స్థానిక ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డిని కలిశారు. కార్యవర్గానికి సహకరించాలని కోరారు. ఈ మేరకు రైతుల ప్రయోజనం కోసం నూతన కార్యవర్గం పాటు పడాలని ఎమ్మెల్యే సూచించారు.

రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోండి

బాలానగర్: నూతనంగా పట్టా పాసుపుస్తకం కలిగిన రైతులు వానాకాలం రైతుబంధు డబ్బుల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రశాంత్ రెడ్డి ఆదివారం సూచించారు. ఈ మేరకు ఆయా గ్రామాల పరిధిలోని ఏఈఓలకు పట్టాపాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లను అందించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం మండల వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

ఆర్థికసాయం

మహమ్మదాబాద్: మండల పరిధిలోని జూలపల్లిలో ఆత్మహత్య చేసుకున్న యువకుడి కుటుంబానికి పరిగి మాజీ ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి తమ పార్టీ కార్యకర్తల ద్వారా రూ. 5వేల ఆర్థికసాయం అందించారు. కొత్త నారాయణ, లింగం ఉన్నారు.